ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (ఆది)
సహారి : 4:31 (సోమ)

ఉండిలో.. ఉత్కంఠ

రఘు.. రామరాజులకు టెన్షన్

సీటు మార్పుపై ఊహాగానాలు.. రెండు రోజుల్లో పూర్తి స్పష్టత



ఎంపీ రఘురామ, ఎమ్మెల్యే రామరాజు

భీమవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంపై ఎన్డీఏ కూటమిలో ఉత్కంఠ నెలకొంది. ఎంపీ రఘు రామకృష్ణంరాజు టీడీపీలో చేరిన తర్వాత ఆయన పోటీ అనివార్యమంటూ అంతా భావిస్తున్నారు. అది ఎంపీ స్థానానికా ? ఎమ్మెల్యే స్థానానికా ? స్పష్టత రావాల్సింది వుంది. నర్సాపురం ఎంపీగా పోటీ చేయాలని ఆయన ఆకాంక్షించారు. కాని పొత్తులో భాగంగా ఈ సీటు బీజేపీకి వెళ్లింది. ఆ పార్టీ నేత భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు టిక్కెట్ కేటాయించడంతో సిట్టింగ్ ఎంపీ పోటీపై చర్చ జరిగింది. చివరకు పాలకొల్లు ప్రజాగళం సభ చంద్రబాబు సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, ఎక్కడ బరిలో నిలిపినా పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే అది ఉండి నియోజకవర్గమంటూ శనివారం మధ్యాహ్నం నుంచి మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగింది. పాలకొల్లులో చంద్రబాబు నరసాపురం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఉండి సమీక్ష వచ్చే సరికి మీతో మాట్లాడే పని వుంది.. మీరు ఉండండి అంటూ చంద్రబాబు ఎమ్మెల్యే రామరాజుతో అన్నారు. దీంతో టిక్కెట్ మార్పు ఖాయమంటూ అక్కడ హాజరైన టీడీపీ నాయకులంతా భావించారు. మరోవైపు ఎమ్మెల్యే అనుచరవర్గం, టీడీపీ నాయకులు చంద్రబాబు సమీక్ష చేస్తున్న ఎస్.కన్వెన్షన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉండి గడ్డ.. రామరాజు అడ్డా.. ఆయన టిక్కెట్ మార్చకూడదంటూ పట్టుబట్టారు. చంద్రబాబు సమీక్షలు పూర్తి చేసుకుని కారులో బస్సు వద్దకు చేరుకునే క్రమంలో పోలీసులు టీడీపీ కార్యకర్తలను పక్కకు తప్పించారు. ధర్నాతో ఉండి టిక్కెట్ మీమాంసలో పడినట్టయ్యింది. టిక్కెట్ మారుస్తారంటూ అంతా అనుకునే పరిస్థితి ఏర్పడింది. దీనిని ఎమ్మెల్యే రామరాజు ఖండించారు. టిక్కెట్ మార్పుపై చంద్రబాబు తనతో ఏమీ చెప్పలేదంటూ మీడియాకు తెలిపారు. మరోవైపు గంట పాటు రామరాజు, మాజీ మంత్రి పితాని, ఎమ్మెల్యే నిమ్మలతో చంద్రబాబు మంతనాలు జరిపారు. అది గోప్యంగా ఉంచారు. రాజకీయ వాతావరణం మాత్రం రామరాజుకు బదులు ఉండి నుంచి రఘురామకు కేటాయిస్తారన్న పరిస్థితి కల్పించింది. చంద్ర బాబు మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉండి టిక్కెట్‌పై నోరు విప్పలేదు. దాంతో ఇప్పుడు అందరి దృష్టి ఉండిపైనే కేంద్రీకృతమైంది.



చంద్రబాబు వద్ద టీడీపీ నాయకుల ఆందోళన



పాలకొల్లు సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

జయం మనదే

నరసాపురం ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో గెలుస్తున్నాం

అలాగని అలసత్వం వద్దు

- అందరిని కలుపుకుని వెళ్లాలి..అభ్యర్థుల సమీక్షలో టీడీపీ అధినేత చంద్రబాబు దిశా నిర్దేశం
- ప్లస్‌లు, మైనస్‌లు.. గణాంకాలతో సహా విశ్లేషణ
- ప్రతి నియోజకవర్గంపై వారానికోసారి సమీక్ష
- పశ్చిమలో ముగిసిన బాబు పర్యటన

భీమవరం/పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అభ్యర్థులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని టీడీపీ అధినేత స్పష్టం చేశారు. నరసాపురం, పాలకొల్లుల్లో ప్రజాగళం సభలు నిర్వహించేందుకు వచ్చిన ఆయన రెండో రోజు శనివారం పాలకొల్లు ఎస్.కన్వెన్షన్‌లో నరసాపురం, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నరసాపురం సమీక్షలో ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అసెంబ్లీ అభ్యర్థులు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఆచంట - పితాని సత్యనారాయణ, తణుకు - ఆరి మిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం-బొలిశెట్టి శ్రీనివాస్, ఉండి - మంతెన రామరాజు, భీమవరం - పులపర్తి రామాంజనేయులు, నరసాపురం - బొమ్మిడి నాయకర్‌తోపాటు, టీడీపీ, జనసేన, బీజేపీ జిల్లా అధ్య క్షులు, నియోజకవర్గాల పార్టీల ఇన్‌చార్జ్‌లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో సమీక్షించారు. నియోజ కవర్గాల్లో తలెత్తుతున్న సమస్యలను వివరించాలని నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే నిమ్మల పలు అంశాలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ డబ్బు తోనే ఎన్నికలను ఎదుర్కోవాలని చూస్తోందని వివరించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ నియోజకవర్గంలో టీడీపీ విజయం ఖాయమైందని, కాని, భారీ మెజారిటీ దిశగా పార్టీల శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కడా ఏ విధమైన లోపం తలెత్తకుండా కార్యకర్తలు జాగ్రత్త పడాలన్నారు. టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి మాట్లాడుతూ జిల్లాలో తూర్పుకాపులు ఎక్కువగా ఉన్నారని అధికారంలోకి రాగానే వారికి న్యాయం చేయాలని చంద్రబాబును కోరారు. ఆయన తగిన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ నియోజకవర్గంలోని పలు అంశాలను బాబు దృష్టికి తీసుకెళ్లారు. నరసాపురం నియోజకవర్గం విషయంలో ఒకింత నొక్కి చెప్పారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు పలు సూచనలు చేశారు. 'గెలుపు ఏకపక్షమని భావించకండి. అందరినీ కలుపుకొని వెళ్లాలి. అప్పుడే గెలుపు సాధ్యపడుతుంది' అంటూ కర్తవ్యబోధ చేశారు. 'పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారు. ఎంపీ స్థానమూ మనదే. అలాగని ఏమరుపాటు తగదు. అందరూ కలిసి పని చేసి ముందుకు వెళ్లండి. వారానికి ఒకసారి ప్రతి నియోజకవర్గ నివేదిక నా వద్దకు వస్తుంది. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోండి. అందరి అభ్యర్థులను సంప్రదిస్తా. లోటు పాట్లు ఉంటే సరిచేసుకుని ముందుకు సాగాలి. కూటమి విజయం దిశగా పయనిస్తోంది. అలాగని కష్టపడకపోతే ఫలితాలు తారుమారవుతాయి. తర్వాత బాధపడ్డా ప్రయోజనం ఉండదు. మూడు పార్టీల అభ్యర్థులు ప్రణాళిక చేసుకుని సమన్వయంతో ముందుకు వెళ్లాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు ఇటీవల చర్చించుకున్న అంశాలను చంద్రబాబుకు వివరించారు. అభ్యర్థుల తరపున చంద్రబాబుతో సంప్రదింపులు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మతో ప్రత్యేకంగా టీడీపీ అధినేత మాట్లాడారు. ఆ విషయాలన్నీ గోప్యంగా ఉంచారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జితోనూ మాట్లాడారు. నియోజకవర్గంలో కలిసికట్టుగా వెళ్లి విజయం సాధించాలని సూచించారు. సమీక్ష అనంతరం తోట సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు తదితరులతో బస్సులో సుదీర్ఘంగా మంతనాలు సాగించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ చంద్రబాబు వరుస సమీక్షలు నిర్వహిస్తూ బిజీగా గడిపారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో గుంటూరులో నిర్వహించే ప్రజాగళం యాత్రకు చంద్రబాబు పయనమయ్యారు.



చంద్రబాబుతో బొలిశెట్టి, వలవల



చంద్రబాబును సత్కరించిన ఆరిమిల్లి, పితాని, సీతారామలక్ష్మి, రామరాజు

త్వరలో బాబు, పవన్ ర్యాలీ

తణుకు నుంచి తాడేపల్లిగూడెం వరకు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇదే విషయాన్ని సమీక్షలో చంద్రబాబు వెల్లడించారు. తణుకులో జనసేన ఇన్‌ఛార్జ్ విడివాడ రామచంద్రరావు కూటమి కోసం పనిచేయడం లేదన్న విషయం చర్చకు వచ్చింది. తణుకు అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఈ విషయాన్ని ప్రస్తావించారు. అక్కడ జనసేనకు కొత్త ఇన్‌చార్జ్ వచ్చే అవకాశం ఉందన్న విషయం చర్చకు వచ్చినట్టు సమాచారం. ఉండిలోనూ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నట్టు నాయకులు ప్రస్తావించారు. భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు సమీక్షకు హాజరయ్యారు. అధికార పార్టీ డబ్బుతోనే ఎన్నికలు నిర్వహించాలని చూస్తోందని నాగేశ్వరరావు చెప్పారు. పార్లమెంట్ స్థానం నుంచి సహకారం ఉంటే అసెంబ్లీ అభ్యర్థులకు వెసులుబాటు ఉంటుందన్న విషయాన్ని అధినేత దృష్టిలో పెట్టారు. నర్సాపురం నుంచి టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

పోలవరం.. మళ్లీ మొదటికొచ్చింది !

జనసేనకు కేటాయించిన పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం విషయంలో కూటమి నేతలు పునరాలోచనలో పడ్డారా ? అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. ఈ స్థానాన్ని అందిపుచ్చుకుంటే గెలుపు సునాయాసమని టీడీపీ తాజాగా స్వరం పెంచింది. దీనిపై ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ ఏర్పడింది.

- ఇప్పటికే జనసేన బాలరాజుకు కేటాయింపు
- ఆ సీటుపై మాట్లాడతానన్న చంద్రబాబు
- అంతకుముందే టీడీపీ నోట ఇదే మాట
- బొరగం శ్రీనుకు అవకాశం ఇచ్చేందుకేనా?

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

భీమడోలులో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆ మేరకు తీర్మానం చేశారు. నల్లజర్లలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుతో ముఖాముఖి సమావేశం జరిగిన తర్వాత ఈ విషయాన్ని ఆయన వద్ద ప్రస్తావించారు. దీంతో పోలవరం సీటు మళ్లీ మారబోతోందా..? అనే సందేహాలు ఆరంభమయ్యాయి. వాస్తవానికి ఆది నుంచి ఈ సీటు విషయంలో సందిగ్ధత లేకపోలేదు. ఐదేళ్లపాటు నిర్విరామంగా గిరిజనులు, గిరిజనేతర పక్షాల మధ్య వారధిగా పనిచేసిన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కే ఛాన్స్ ఇవ్వాలంటూ వాదనలు చోటు చేసుకున్నాయి. పొత్తు ధర్మంలో భాగంగా జనసేన కోరినట్టు పోలవరం స్థానాన్ని జనసేనకే కేటాయించారు. ఆలోపు అక్కడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ చిర్రి బాలరాజుకు సమాంతరంగా మరికొందరు పోలవరం సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇస్తే జనసేన నుంచి చిర్రి బాలరాజుకు ఇవ్వాలి లేదా టీడీపీ నుంచి బొరగం శ్రీనివాస్‌కు మాత్రమే ఇవ్వాలే తప్ప మరొకరికి అవకాశం ఇవ్వరాదంటూ కొయ్యలగూడెంలో నియోజకవర్గ నేతలంతా సమావేశమై చర్చించుకున్నారు. ఇది జరిగి చాలా కాలమైంది. ఆ లోపే ఉమ్మడి పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిగా బాలరాజును ప్రకటించారు. ఆయన కూడా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తమ పార్టీని గెలిపించాలని ఉమ్మడి పొత్తులో భాగంగా మిగతా వారంతా తనకు సహకరించాలని ఆయన పదే పదే అభ్యర్థిస్తూనే వచ్చారు.

అంతలోనే ఏమైంది..?


ఈ నిర్ణయం క్షేత్రస్థాయిలో అందరిని తృప్తిపరచలేక పోయింది. కీలకమైన పోలవరం ప్రాజెక్టు ఇదే నియోజకవర్గ పరిధిలో ఉండడం, ఈ ప్రాజెక్టు చుట్టూనే కీలక పరిణామాలు చోటు చేసుకోవడం, రాష్ట్రస్థాయిలో నిత్యం చర్చకు దారి తీయడం ప్రత్యేకించి రాష్ట్ర అధినేతలు పదేపదే ప్రాజెక్టు స్థలి సందర్శనకు రావడం వంటి పరిణామాలను టీడీపీ బేరీజు వేస్తూ వచ్చింది. ఒకపక్క నిర్వాసిత కుటుంబాలు వైసీపీపై తీవ్ర అసంతృప్తితో ఉండడం, ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుపైన ఇదే ధోరణిలో ఉండడం వంటి పరిణామాలు దృష్టిలో పెట్టుకుని ఈ మధ్యనే టీడీపీ మరో డిమాండ్‌ను తెర ముందుకు తెచ్చింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయుల సమక్షంలోనే పోలవరం సీటును టీడీపీకి కేటాయిస్తే అద్భుతమైన విజయం పార్టీకి దక్కుతుందంటూ నియోజకవర్గ ముఖ్యలంతా ఏకతాటిపైకి వచ్చారు. ఈ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

ఆ సీటు సంగతి మాట్లాడదాం..

పోలవరం సీటు జనసేన నుంచి టీడీపీకి మార్చే విషయంలో ఏలూరు జిల్లా నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. శుక్రవారం నల్లజర్లలో ఏలూరు జిల్లా పార్టీ కన్వీనర్‌లతో చంద్రబాబు భేటీ అయ్యారు. ప్రతి విషయాన్ని అందరిని అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పరిస్థితులను ఆరా తీశారు. ఇదే సమయంలో పోలవరం విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఈ సీటు విషయాన్ని మాట్లాడాల్సిందేనంటూ వ్యాఖ్యలు చేసినట్టు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ పరిణామాల క్రమంలో పోలవరంపై తిరిగి చర్చ ఆరంభమైంది. టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు మరోసారి అవకాశం ఇచ్చేలా ఈ పరిణామాల క్రమం ఉందని భావిస్తున్నారు.



చిర్రి బాలరాజు, బొరగం శ్రీనివాస్



తపనా దారెటు!

- పార్టీలో ఉంటూనే రగులుతున్న వైనం
- సర్దుబాటుకు ప్రయత్నించని కమలనాథులు
- బీజేపీ ఆవిర్భావం నాడే చౌదరి బలప్రదర్శన
- ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకే సన్నాహాలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి పార్టీని వీడబోతున్నారా? తనకు ఏలూరు సీటు దక్కకుండా చేయడమే కాకుండా తన బలాన్ని తక్కువగా అంచనా వేశారని, మదన పడుతున్నారా? వీలైతే తగినంత బలగాన్ని వెంటేసుకుని పార్టీని వీడి ఇండిపెండెంట్‌గా పోటీ చేయబోతున్నారా? అనే ప్రశ్నలకు ఆ పార్టీలో అత్యధికులు అవుననే బదులిస్తున్నారు. ఏలూరు ఎంపీ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఇక్కడి నుంచి పోటీ చేయడానికి వీలుగా గడిచిన కొన్నేళ్లుగా తపనా చౌదరి బలమైన పునాదులు వేసుకున్నారు. బీజేపీ పరిస్థితి అతంతమాత్రంగానే ఉన్నా సేవా కార్యక్రమాలను విస్తరించడం ద్వారా ఆయన ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. చాన్నాళ్లా పాటు పార్టీ కార్యక్రమాలకు వ్యయప్రయాసలను ఆయనే మోస్తూ వచ్చారు. ఆఖరికి ఉమ్మడి కూటమి పొత్తులో భాగంగా ఏలూరు ఎంపీ స్థానం లేకపోవడం సహజంగానే తపనా చౌదరితో పాటు బీజేపీ కార్యకర్తలు, ఆయన అభిమానులకు అసంతృప్తి కలిగించింది. పార్టీకోసం ఇన్నాళ్లు కష్టపడినా ఏలూరు కేంద్రంగా బహిరంగ సభలకు తానే ముందుండి నిర్వహించినా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్‌గా అక్కడ కూడా పార్టీ పటిష్ఠతకు నిత్యం శ్రమించిన చివరికి మొండిచేయి మిగిలిందన్న తీవ్ర అసంతృప్తితో చౌదరి రగిలి పోతున్నారు. తనను కలుస్తున్న పార్టీనేతలు, కార్యకర్తలతో ఇదే విషయాన్ని ఆయన నిర్మొహమాటంగా వెల్లడిస్తూనే తాను ఏం చేస్తే బావుంటుందంటూ ప్రతిఒక్కరి నుంచి సమాధానం రాబట్టే ప్రయత్నం చేశారు. ఉమ్మడి జాబితాలో ఏలూరు లేక పోవడం ఒక ఎత్తు అయితే తనకు సీటు రాకుండా పోయిందనే బాధలో ఉన్న చౌదరికి పార్టీ పరంగా ఓదార్పు కరువు అయినట్టు చెబుతున్నారు. తనకు ఎలాగో సీటు దక్కక పోవడం, పెద్దలు పట్టించుకోకపోవడం, ఇన్నాళ్లు పడిన కష్టానికి ఇదేనా పరిహారం అంటూ బాధపడుతూనే పార్టీ కార్యక్రమాల్లో తపనా చౌదరి పాల్గొంటూనే వచ్చారు. ఇదే క్రమంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవమైన శనివారం ఆయన కాస్తంత బల నిరూపణకు ప్రయత్నించారు. ఆయన పోల వరం నుంచి కైకలూరు వరకు 150 కి.మీ మేర శనివారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు సీనియర్లు పాలు పంచుకున్నారు. అడుగడుగునా పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తూనే ఇంకోవైపున అందరూ బాగున్నారా అంటూ ప్రశ్నలు సంధిస్తూనే ఆయన ముందుకు సాగుతూ వచ్చారు.



పోలవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న తపనా చౌదరి

ఇండిపెండెంట్‌గానే బరిలోకి?

తన రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా ముగించిన బీజేపీని విడనాడి, ఏలూరు ఎంపీ సీటుకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా తపనా చౌదరి పోటీ చేయబోతున్నారా? అనే ప్రశ్నకు దాదాపు అవుననే రీతిలోనే ఆయన వ్యవహారశైలి శనివారం అంతా సాగింది. కమలనాథులు ఎవ్వరూ కనీసం ఆయనకు మద్దతుగా నిలువక పోవడం, నిలిచినా ఆయన స్థితిగతులపై ఢిల్లీ వరకు సమాచారం తీసుకెళ్లలేక పోవడం వంటి అనేక అంశాలతో విసుగెత్తిన చౌదరి, ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. వీలైతే కొద్దిరోజుల వ్యవధిలోనే ఆయన బీజేపీకి బై చెప్పి ఎన్నికల రంగంలో దిగుతారని అంచనా వేస్తున్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

నగదు జప్తు కేసులను 24 గంటలలోపే పరిష్కరించాలి

- వీసీలో సీఈవో ముఖేష్ కుమార్ మీనా

ఏలూరు సిటీ, ఏప్రిల్ 6 : నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని ఇందుకే రాష్ట్రమంతా ఒకే విధానాన్ని అవలంభించేలా ఎస్‌వోపీని రూపొందించి కమ్యూనికేట్ చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష చేశారు. ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్య వేణి, ఎస్పీ మేరీప్రశాంతి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, ఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్ని కల అధికారులు, ఎస్పీల పైనే ఉందన్నారు. హింసకు, రీపోలింగ్‌కు తావు లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, జిల్లా సరిహద్దుల్లో పటిష్టంగా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టి, గంజాయి, లిక్కర్, నగదు, ఉచిత అక్రమరవాణా వస్తువులపై తనిఖీలు నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగిఉంటే వెంటనే జప్తు చేయాలని, వ్యాపారులు, సాధారణ పౌరులను ఇబ్బందులకు గురిచేయవద్దని తెలిపారు. రూ.10లక్షలకు పైబడి జప్తు చేయబడిన నగదు, బంగారం ఇతర విలువైన వస్తువుల సమాచారాన్ని ఇన్‌కంటాక్స్ అధికారులకు తెలపాలన్నారు. వివిధ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీల ద్వారా సమాచారంపై మీనా సమీక్షించారు.

25న టెన్త్ ఫలితాలు ?

- నేటితో ముగియనున్న మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఈ నెల 25న ప్రకటించే వీలున్నట్టు జిల్లా విద్యాశాఖ వర్గాల నుంచి సంకేతాలు అందుతున్నాయి. అయితే ఫలితాల విడుదలపై ఇంతవరకు అధికారిక ప్రకటన ఏదీలేదు. ప్రస్తుతం జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియలో 95 శాతం ఆదివారం మధ్యాహ్నానికి ముగియనుండగా, మిగతా తెలుగు ఫస్ట్ లాంగ్వేజి, హిందీ జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారంతో పూర్తవుతుందని అధికార వర్గాలు వివరించాయి. ఏదైనా సాంకేతిక కారణం ఎదురైతే ఈనెల 30వ తేదీలోగా ఫలితాలను వెల్లడిస్తారని పేర్కొన్నాయి. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్న తర్వాతే ఫలితాలను విడుదల చేస్తారు. జవాబు పత్రాల మూల్యాంకనకు గతేడాది పెంచిన రేట్ల ప్రకారమే బడ్జెట్ నిధులు విడుదల కాగా, స్పాట్ వాల్యుయేషన్ ముగిసిన వెంటనే సంబంధిత సిబ్బంది బ్యాంకు ఖాతాలకు పారితోషకాన్ని జమ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఒక్కో జవాబు పత్రం మూల్యాంకనానికి రూ.6.60 పైసల నుంచి పది రూపాయలకు పెంచిన విషయం తెలిసిందే. కాగా గతేడాది బకాయి పడిన టీఏ, డీఏ చెల్లింపులకు రూ.30 లక్షలు నిధులు విడుదల కావడంతో గురువారమే టీచర్ల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు ఏపీ ఓపెన్ స్కూల్స్ దూర విద్య ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనను ఈ నెల 13 నుంచి 17 వరకు సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు డీఈవో అబ్రహం తెలిపారు.

చాట్రాయిలో కల్లంపై ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు



పంట పండింది

- మొక్కజొన్న క్వింటా ధర రూ.2,180
- ఎకరానికి 35-40 క్వింటాళ్ల దిగుబడులు
- రైతుల మోములో ఆనందం

చాట్రాయి, ఏప్రిల్ 6 : మొక్కజొన్న రైతులకు ఈ ఏడాది కాసుల పంట పండింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, దిగుబడి ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. రబీలో మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వరి సాగు భూములు, జరీబు తోటలు ఇతర భూములు ఎక్కడా ఖాళీ లేకుండా మొక్కజొన్న సాగు అయ్యింది. రైతులకు పెట్టుబడి ఎకరాకు సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేలు అవుతుంది. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు, క్వింటా రూ.2,180 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతుల మోములో ఆనందం వ్యక్తమవుతోంది.



ఏపీ నిట్‌లో విద్యార్థులతో ఆచార్యులు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 6:విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య అన్నారు. ఏపీ నిట్‌లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్‌తీపర్తి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మనసు పెట్టి సాధన చేస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. నూతన విద్యా విధానంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని వైవిధ్య భరితమైన ఆలోచనలతో ముందుకు వచ్చే విద్యార్థులను సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. డీన్‌లు డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఖ్యాతి గడించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆచార్యులు డాక్టర్ నరసింహ, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ పి. కిషోర్, డాక్టర్ తలారి రేష్మ, సాస్ అసిస్టెంట్స్ డాక్టర్ శ్రీనివాస్, సాయిరాం, సంధ్యారాణి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీల విజేత 'ఎస్‌ఆర్‌కేఆర్'


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ జగపతిరాజు

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6:జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీలలో ఎస్‌ఆర్‌కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి పది వేలు రూపాయ ల నగదు బహుమతి గెలుచుకున్నారని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతిరాజు తెలిపారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌ఐ చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బూట్ క్యాంప్, శుక్ర, శనివారాల్లో జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ బహుమతి పొందిన విద్యార్థుల బృందం ఇయర్ ఫోన్స్ రెండు గంటలు దాటిన తరువాత ఆటోమెటిక్‌గా అవి పనిచేయటం ఆగిపోయే విధానాన్ని రూపొందించారు. ద్వితీయ బహుమతి ఎస్‌ఆర్‌కేఆర్ విద్యార్థులు రూ.ఆరువేల నగదు బహుమతి, మూడో బహుమతి సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల రూ.నాలుగువేల నగదు బహుమతి, నాలుగో స్థానంలో ఎస్‌ఆర్‌కేఆర్‌కు దక్కగా, ఐదో స్థానం తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలకు దక్కిందన్నారు. ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీహెచ్ వీఎస్ రామకృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడారు. కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కిషోర్‌రాజు, రామ్‌గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా


విజేతలను అభినందిస్తున్న డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 6: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా ఇండోర్ స్టేడియం క్రీడాకారులు భువనరత్నశ్లోక, అండర్-17 విభాగంలో సీహెచ్ మౌనికదివ్యశ్రీ, రజిత పతకాలు, రింక్-2లో కాంస్య పతకం సాధించారని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తిరుపతిలో శ్రీవేంకటే శ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గతనెల 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరు ఈనెల 10 నుంచి 15వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక అయ్యారు. వీరిని కోచ్‌తో పాటు తదితరులు అభినందించారు.

'విర్డ్'లో కృత్రిమ అవయవాల పంపిణీ


విర్డ్ ఆసుపత్రిలో కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న ట్రస్టీ సుధాకరరావు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6: ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్న వారికి, దివ్యాంగులకు స్థానిక విర్డ్ ఆసుపత్రిలో శనివారం పరికరాలను పంపిణీ చేశారు. గుప్తా ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు పద్నాలుగు కాలిపర్స్, ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్నవారికి అత్యాధునిక కృత్రిమ అవయవాల విభాగంలో ప్రోస్టేసిస్ 3డి ప్రింట్‌తో తయారైన నాలుగు కృత్రిమ అవయవాలను ఆసుపత్రి ట్రస్టీ ఐవీఆర్ సుధాకరరావు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ట్రస్టీ వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆవరణలో తాచుపాము హల్‌చల్


క్యూకాంప్లెక్స్‌లో వున్న తాచుపాము

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ జంటగోపురాల వద్ద గల క్యూకాంప్లెక్స్‌లో ఓ తాచుపాము శనివారం హల్‌చల్ చేసింది. దాదా పు ఐదు అడుగుల పైబడి ఉన్న తాచుపాము బుసలు కొట్టడంతో భక్తులు పరుగులు తీశారు. అక్కడున్న సెక్యూరిటీ, ఇతరులు పామును బెదర కొట్టడంతో అది సమీపంలో ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

6-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	226	235.47
జంగారెడ్డిగూడెం-1	242	235	239.92
జంగారెడ్డిగూడెం-2	242	235	239.90
కొయ్యలగూడెం	242	235	240.01
గోపాలపురం	242	235	240.18

మండుతున్న ఎండలు

ఉక్కపోత..వడగాడ్పులతో ప్రజలు విలవిల


ఆచంటలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. భానుడి ప్రతాపంతో జనం విలవిల్లాడుతున్నారు. ఉక్కపోత విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

- ఏలూరుసిటీ/ఆచంట/చింతలపూడి

గత ఏడాదితో పోలిస్తే ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. మేలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు నమోదు కావడం విశేషంగా పేర్కొనవచ్చు. శుక్రవారం జిల్లాలలోనే అత్యధికంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, భీమడోలు, కొవ్వూరు, నిడదవోలు, తదితర ప్రాంతాల్లో 44 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం కూడా 41 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడిగాలులు ప్రభావంతో ప్రజలు రహదారులపైన ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, బయటకు వెళ్లే సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు ఇప్పటికే మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను చాలా ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు తగ్గేవరకు కరెంటుకోతలు విధించవద్దని మంచినీరు సమస్య రాకుండా చూడాలని గ్రామాల్లో స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల వేళ ఎండల గోల

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఎండల తీవ్రత పెరగటంతో రాజకీయ పార్టీల నాయకులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించటానికి అవస్థలు పడుతున్నారు. పగటి పూట ఎన్నికల ప్రచారాలు రద్దు చేసుకుని సాయంత్రం వేళల్లోనే ప్రచారాలను నిర్వహిస్తున్నారు.

లో-వోల్టేజి సమస్య పరిష్కరించండి



జీలుగుమిల్లి, ఏప్రిల్ 6 : లో-ఓల్టేజి సమస్య పరిష్కరించాలని జీలుగుమిల్లి గ్రామ మహిళలు విద్యుత్‌శాఖ అధికారి జేఈ హరిబాబును శనివారం కోరారు. కొన్ని నెలలుగా జీలుగుమిల్లిలో లోఓల్టేజి సమస్య ఉందన్నారు. ఇటీవల ఫ్రిజ్‌లు, టీవీలు ఫ్యాన్‌లు, మిక్సీలు, వాషింగ్ మిషన్‌లు రోజుకో ఇంటిలో కాలిపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

ఏలూరుసిటీ, ఏప్రిల్ 6: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. భానుడి భగభగలతో రోజువారీ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని విద్యుత్ అధికారుల నివేదికలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఏప్రిల్ మొదటి వారంలోనే తారాస్థాయికి చేరిందని, వారం రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయని, దీంతో ఎండ వేడిమిని తట్టుకోలేక ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్యాన్ల వినియోగం, కూలింగ్ వాటర్ కోసం ఫ్రిజ్‌లు వినియోగం పెరిగిందని చెబుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ కోటా వస్తోందని, అయినా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోత అమలులోనే ఉందని తెలుస్తోంది. బోర్ల కింద సాగులో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులు ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు విద్యుత్ వినియోగం పరిశీలిస్తే ఈనెల 2,3,4 తేదీల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని ఏపీఈపీడీసీఎల్ వారి నివేదికలు చెబుతున్నాయి. ఈ పరిస్థితులను పరిశీలిస్తే రాబోయే రోజుల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

చుర్రుమన్న రాతి మెట్లు


ఆలయ మెట్లను మోకాళ్లతో ఎక్కుతున్న దంపతులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6: ప్రతీ వేసవి కాలంలో వేడిని తట్టుకునేవిధంగా ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ప్రధాన రాజగోపురం మీదుగా ఆలయానికి చేరుకునే భక్తుల పాదాలకు రక్షణ కలిగేలా ఆలయవర్గాలు నీరును నిరంతరం వదిలేవారు. ఈసారి ఎండలు మండుతున్నా రాతిమెట్లపై నీరు వదలక పోవడంతో భక్తులు ఆపసోపాలు పడుతూ మెట్లు ఎక్కారు. మోకాళ్లపై నడిచే వారు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో నీటిని వదిలే ప్రక్రియ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం ఇలా..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు (గత వారం రోజుల్లో)

	2023 సంవత్సరం		2024 సంవత్సరం		
తేదీ	విద్యుత్ కోటా (మిలియన్ యూనిట్లు)	వినియోగం (మి.యూ)	విద్యుత్ కోటా (మి.యూ)	వినియోగం (మి.యూ)	వ్యత్యాసం
మార్చి 30	22.340	22.308	24.143	23.469	1.161
మార్చి 31	22.078	22.036	24.029	23.166	1.130
ఏప్రిల్ 1	22.933	21.195	24.080	22.910	1.715
ఏప్రిల్ 2	20.032	20.185	24.080	23.239	3.054
ఏప్రిల్ 3	22.616	20.320	23.588	23.226	2.906
ఏప్రిల్ 4	21.248	20.811	23.896	23.291	2.480
ఏప్రిల్ 5	21.513	21.599	24.071	23.449	1.850

అలాచేస్తేనే అందరికీ ఆరోగ్యం

» హెచ్‌బీఐ వైస్ చైర్మన్ డాక్టర్ రాజు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 : అందరికీ వైద్యం అందుబాటులో ఉంచడానికి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఏప్రిల్ 7వ తేదీని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన మేనిఫెస్టో (ప్రమాణపత్రం)ను దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయడానికి ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఒడిదుడుకులు, పరిష్కారమా ర్గాలపై శనివారం హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ డాక్టర్ సీఎస్.రాజు ఏలూరులో ఓ పత్రికాప్రకటన విడుదల చేశారు. మేనిఫెస్టో ఆశయాలను సాధించ డానికి వైద్యవృత్తిలో కొన్ని వెసులుబాట్లను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. ఆస్పత్రులకు భద్రత కల్పించడం, వైద్యులపై దాడులను అరికట్ట డం ప్రభుత్వాల బాధ్యతగా ఉండాలన్నారు. దీనికోసం ఆస్పత్రులు, ఆరోగ్యరంగ సంస్థలను సేఫ్‌జోన్లుగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2000 నుంచి 50 పడకల సామర్థ్యంలోపుగల చిన్న, మధ్య తరహా ఆస్పత్రులకు మినహాయింపునివ్వాలని సూచించారు. రోగులకు వైద్యసేవల్లో భాగంగా పాటించే వెంటిలేటర్లు, మానిటర్లు, ఎనస్థీషియా పరికరాలు, ఎక్స్‌రే మిషన్లు, అల్ట్రాసౌండ్ మిషన్లు, మధుమేహం టెస్టింగ్ స్ట్రిప్‌లు, డ్రగ్స్, ఆక్సిజన్, డిస్పోజబుల్స్, వైద్యపరికరాల మరమ్మతులపై జీఎస్టీని విధించడం సరైందికాద న్నారు. చివరకు పడకపై రోగికి అందించే వైద్యసేవలకయ్యే బిల్లులపై జీఎస్టీని విధించడం దారుణమన్నారు. ముఖ్యంగా ముందుజాగ్రత్తగా తీసుకునే ఆరోగ్య బీమాకు 18శాతం జీఎస్టీని విధిస్తే అందరికీ ఆరోగ్యం ఎలా సాధ్యమవు తుందని ప్రశ్నించారు. ఈ విషయాలన్నింటినీ ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ప్రభుత్వాలను నిలదీయాలని, జీఎస్టీని తగ్గించడమో లేదా పూర్తిగా మినహాయించడమో చేయాలన్నారు. వైద్యవృత్తిని క్రిమినల్ ప్రాసిక్యూషన్ పరిధినుంచి తప్పించాలని కోరారు. పలు వైద్య చికిత్సలకు ప్రభుత్వాలు నిర్ధారించిన రేట్లను స్థానిక పరిస్థితులు, ఆస్పత్రి మౌలిక సదుపాయాలకనుగుణంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. భారతీయ వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వైద్యవిద్యార్థులకు లైసెన్సింగ్ నిమిత్తం 'నెక్స్' పరీక్షలో ఉత్తీర్ణులైతేనే పీజీ వైద్యవిద్యకు అర్హతకల్పించడం పూర్తిగా అన్యాయమని, కేంద్రప్రభుత్వం ఈ నిబంధనను సడలించాలని కోరారు.

వలంటీర్ల రాజీనామాకు ఆదేశం!?

నూజివీడు, ఏప్రిల్ 6: ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గంలో వలంటీర్లను సోమవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని కోరుతూ వైసీపీకి చెందిన నాయకుల నుంచి శనివారం ఆదేశాలు అందినట్టు సమాచారం. ఈ ఆదేశాలకు వంద మందివలంటీర్లు సుముఖంగాను, మరికొంత మంది విముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. పలువురు వలంటీర్లు టీడీపీ అధినేత చంద్రబాబు తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారంటున్నారు. మరికొంతమంది రాజీనామాలు చేసి వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం మారితే రాజీనామా చేసిన వలంటీర్ల పరిస్థితి ఏమిటని ? వలంటీర్లలో చర్చలు ప్రారంభమయ్యాయి.

స్పందన కొరతే కారణమా ?

వైసీపీకి చెందిన అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ నాయకులు పాల్గొనకుండా ముఖం చాటేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, నాయకులు పిలిచినా ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి రావాలి ? గ్రామాలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాభివృద్ధికి ఉపయోగించకుండా రాష్ట్రప్రభుత్వమే తన ఖాతాలో జమ చేసుకుని మొండిచేయి చూపింది. మరోపక్క వలంటీర్లను నమ్ముకుని గ్రామస్థాయి నాయకులను, స్థానిక ప్రజాప్రతినిధులను పార్టీ విస్మరించడం వంటి అంశాలను వైసీపీ నాయకులకు ఎత్తిచూపుతూ ఎన్నికల రంగంలోకి దిగకుండా ముఖం చాటేస్తున్నారు. ఆయా గ్రామాల్లో స్థానికులు అడిగే ప్రశ్నలకు వైసీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పలేని దుస్థితి నూజివీడు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. నూజివీడు రూరల్ మండలంలో 447, నూజివీడు అర్బన్‌లో 306, చాట్రాయి మండలంలో 298, ఆగిరిపల్లి మండలంలో 297, ముసునూరు మండలంలో 300మంది వలంటీర్లు ఉన్నారు. వైసీపీ ఆదేశించిన రాజీనామా అంశంపై వీరిలో ఎంతమంది పాటించి రాజీనామాలు చేస్తారో ? త్వరలో తేలనుంది.

కొనసాగుతోన్న వలంటీర్ల రాజీనామా

ఆచంట మండలంలో మరో 46 మంది..

ఆచంట, ఏప్రిల్ 6 : వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆచంట మండలంలోని వేమవరం, కొడమంచిలి, అయోధ్యలంక, భీమలాపురానికి సంబంధించి 46 మంది రాజీనామా చేసినట్టు ఎంపీడీవో పి.నరసింహప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 295 మంది వలంటీర్లకు గాను ఇప్పటి వరకు 231 మంది రాజీనామా చేశారు.

ఉంగుటూరు మండలంలో 21 మంది..

ఉంగుటూరు, ఏప్రిల్ 6 : ఉంగుటూరు మండలం నారాయణపురంలో పదమూడు మంది, తిమ్మయ్యపాలెంలో ఆరుగురు, గోపీనాథపట్నంలో ఇద్దరు వలంటీర్ల రాజీనామా చేసినట్టు ఎంపీడీవో శర్మ శనివారం తెలిపారు.

పంటల ఆఖరి తడివరకు నీరు విడుదల చేస్తాం


నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: 'పంటలకు ఆఖరి తడి వరకు నీటిని విడుదల చేస్తాం. ఈనెల 20వ తేదీ వరకు కాల్వలు కట్టే పరిస్థితి లేదు. శివారు భూములు, ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటి చెరువులకు నీరు ఇబ్బంది లేకుండా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం' అని గోదావరి డెల్టాసిస్టమ్ ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ రేవూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఏలూరు ప్రధాన కాల్వపై ఆధారపడిన ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో సుమారు 60 ఎకరాల భూములకు నీటిఎద్దడి తలెత్తడంతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు శనివారం నాలుగు కరెంటు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిలో పంట భూములకు మంచినీటి అవసరాలకు సరిపడే నీటిలభ్యత ఉందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉభయగోదావరి జిల్లా గోదావరి డెల్టా సిస్టమ్‌లో రెండోపంట దాళ్వాలో 8లక్షల96వేల ఎకరాల్లో ఊడ్పులు జరిగాయన్నారు. గత ఏడాది డిసెంబరులో తుఫాన్‌వల్ల కురిసిన వర్షాలకు సముద్రతీర ప్రాంతాల్లో ఊడ్చిన పంటలకు ముంపునకు గురై పంట కుళ్లిందన్నారు. ముంపు తరువాత సుమారు 30 వేల ఎకరాల్లో ఊడ్పులు జరిగాయన్నారు. నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

దేవదాయ శాఖ ఆస్తులను పరిరక్షించాలి

» రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6:దేవదాయ భూములను, శాఖ ఇతర ఆస్తులను మన సొంత ఆస్తులను కాపాడుకునే రీతిలో ప్రతీ ఈవో పరిరక్షించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. స్థానిక మాధవ కల్యాణమండప ఆవరణలో శనివారం కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు, కాకినాడ డివిజన్‌లోని 6(ఏ)(బి)(సి)(ఇ) ఆలయాల్లో, ధర్మసత్రాలలో పనిచేసే ఈవోలు, మేనేజర్లు, డివిజనల్ ఇన్‌స్పెక్ట ర్లు, ఇంజనీర్లకు ఆయన దేవాలయ భూములు, ఇతర ఆస్తుల పరిరక్షణ, రీసర్వేపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో భూముల రీసర్వే ఆడిట్, గడచిన మూడేళ్లలో ఆలయానికి వచ్చిన ఆదాయం, ఖర్చులు ఇతర అంశాలపై చర్చించారు. ఆలయాలకు ఆదాయం చేకూర్చే అంశాలు, భూముల వివరాలు, భూసేకరణ, ఆభరణాలు, బంగారం ఇతర వస్తువుల భద్రతపై చర్చించారు. ఏ అధికారి అలసత్వం వహించవద్దని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవదాయశాఖ ఏడీసీ రామచంద్రమోహన్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్, ఈవో వేంద్ర త్రినాథరావు, డీసీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



రంపాలరాజు కుటుంబసభ్యుల రాస్తారోకో, స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

న్యాయం చేయాలని దళిత కుటుంబం రాస్తారోకో

బుట్టాయగూడెం, ఏప్రిల్ 6 :భూమి విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుట్టాయగూడెంకు చెందిన బాషా రంపాలరాజు కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తాతలతండ్రుల కాలం నుంచి తమకు మర్రిగూడెం సమీపంలో భూమి ఉందని తమపై మర్రిగూడెంకు చెందిన కొందరు గిరిజనులు దౌర్జన్యం చేస్తూ పంటలను ఎత్తుకుపోతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయడంలేదని రాజు, అతడి కుమారుడు బాషా శ్యాంబాబు తెలిపారు. మూడు రోజుల క్రితం జీడిమామిడి తోటలోని తాటాకు పాకను గిరిజనులు తగలబెట్టారని వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా రెవెన్యూ వారు పోలీసులపై.. పోలీసులు రెవెన్యూవారిపై చెప్పడం తప్ప సమస్యను పరిష్కరించడం లేదన్నారు. గతంలో గిరిజనులు భూములపై దౌర్జన్యం చేసిన రికార్డుల పరిశీలన తర్వాత భూములు అప్పగించారని కొందరు భూస్వాములు వెనుక ఉండి గిరిజనులను ప్రోత్సహిస్తూ దాడులు చేయిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌ఐ కె.వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ముందస్తు అనుమతి లేనిదే ఆందోళనలు రాస్తారోకోలు చేయకూడదని బాషా శ్యాంబాబును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో ఆందోళనకారులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. మరోవైపు మర్రిగూడెంకు చెందిన కొందరు గిరిజనులు ఇవే భూములు తమకు చెందుతాయని ఆందోళనలు చేస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మద్యం తాగి హింసిస్తున్న భర్తపై కేసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 : మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్న భర్తపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు అరుంధతి పేటకు చెందిన ఆలూరి మల్లిక (28) భర్త తుఫాన్ అలియాస్ కిషోర్ నిత్యం మద్యంతాగి ఆమెను శారీకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన మద్యం తాగి వచ్చి ఆమెను కొట్టాడు. తీవ్ర గాయలపాలైన ఆమె ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు తుఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

సారా విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

టి.నరసాపురం, ఏప్రిల్ 6 : నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. శనివారం వెలగపాడు గ్రామ శివారులో సారా తయారీ చేసే స్థావరంపై దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 30 లీటర్ల సారా, తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ములను, పాత్రలను స్వాధీనం పర్చుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి చింతలపూడి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

» ఒకరి అరెస్ట్.. ఇద్దరు పరారీ.. బెల్లపు ఊట ధ్వంసం

పోలవరం, ఏప్రిల్ 6 : చేగొండపల్లి పంచాయతీ మెత్తప్పకోట అటవీ ప్రాంతంలో శనివారం సారా తయారీ కేంద్రాలపై పోలవరం పోలీసులు దాడులు నిర్వహించారు. 150 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, రెండు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలవరం ఎస్‌ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ బట్టీ నిర్వహకుడు ఎం.సోమరాజును అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపర్చామన్నారు. కోర్టు ఈనెల 19 వరకు రిమాండ్ విధించిందని, ముద్దాయిని ఏలూరు జిల్లా జైలుకు తరలించామని మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

కలపర్రు హైస్కూల్‌లో చోరీ

పెదపాడు, ఏప్రిల్ 6 : కలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగినట్టు పాఠశాల హెచ్.ఎం. భీమయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పాఠశాలకు సెలవు దినం కావడంతో శనివారం ఉదయం పాఠశాలకు వచ్చేసరికి కంప్యూటర్ గది తాళాలు బద్దలుకొట్టి ఉండడాన్ని గమనించి లోపల పరిశీలించగా రూ.1.50 లక్షల విలువ గల ఐఎఫ్‌పీ పరికరాలు కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఐ కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి..

» ముగ్గురి అరెస్టు.. రూ.9,360 నగదు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 : ఏలూరు రూరల్ మండలం పోణంగి, శ్రీపర్రు మార్గమధ్యలో కాలవ గట్టుపై కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు శనివారం రాత్రి ఏలూరు రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డికి సమాచారం అందింది. తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి కోడి పందేలు ఆడుతున్న కొంతమంది పరారీ కాగా ముగ్గురు దొరికారు. వారి నుంచి 9 వేల 360 రూపాయల నగదు, ఒక కోడి పుంజు, ఏడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బీరు బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 : ఏలూరు మాదేపల్లిరోడ్డు ప్రేమాలయం సమీపంలో నివాసం ఉంటున్న జుత్తిగ నాగ మునీంద్ర ఆరు బీరు బాటిల్స్ కల్గి అనుమానాస్పదంగా శుక్రవారం రాత్రి వేళ తిరుగుతున్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో నగదు పట్టివేత

చింతలపూడి, ఏప్రిల్ 6: చింతలపూడి మండలం రాష్ట్ర సరిహద్దు లింగగూడెం, అల్లిపెల్లి చెక్‌పోస్టులలో వాహనాలు తనిఖీలో భాగంగా పత్రాలు చూపకపోవడంతో రూ.1,55,540 నగదును పట్టుకున్నట్టు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ శనివారం తెలిపారు. లింగగూడెం చెక్‌పోస్టులో 62,340, అల్లిపెల్లి చెక్‌పోస్టులో 93,200, ఎస్.ఎస్ టీమ్ తనిఖీ చేయగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు చూపకపోవడంతో ఈ నగదును జిల్లా ట్రెజరీలో డిపాజిట్ చేశామని ఎన్నికల అధికారి తెలిపారు.

భర్తకు విడాకులిచ్చి వస్తే పెళ్లి చేసుకుంటా..

» మాటనమ్మి తెలంగాణ నుంచి వచ్చిన మహిళ..

» వివాహేతర సంబంధం కొనసాగించి ఆపై పెళ్లికి నిరాకరణ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 : భర్తకు విడాకులు ఇస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆపై ఆమె విడాకులు ఇచ్చిన తరువాత వివాహేతర సంబంధం కొనసాగించి పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడిపై కేసు నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఓ ప్రాంతానికి చెందిన యువతి గతంలో ఏలూరులోని తన బంధువుల ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఏలూరు గన్‌బజార్‌కు చెందిన బంగారు జగదీష్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆ యువతికి తరువాత వివాహమైంది. వివాహమైనప్పటికీ భర్తతో విడాకులు ఇచ్చి వచ్చేస్తే పెళ్లి చేసుకుంటానని యువకుడు నమ్మించాడు. అతడి మాటలు నమ్మి భర్తకు విడాకులు ఇచ్చి ఏలూరు వచ్చేసింది. వేరేచోట ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగించి, ఆమె వద్ద నుంచి ఐదు లక్షల రూపాయలు వరకు సొమ్ములు తీసుకున్నాడు. ఆపై పెళ్లికి నిరాకరించాడు. బాధితురాలు తాను మోసపోయానని గ్రహించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎన్.ప్రభాకర్ బంగారు జగదీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు దొంగల అరెస్టు.. 17 బైక్‌ల స్వాధీనం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఉండ్రాజవరం పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడదవోలుకు చెందిన బొద్దూరి సతీష్, నిడదవోలు మండలం సమిశ్రగూడెంకు చెందిన తాతోలు రామకృష్ణ 17 మోటారుసైకిళ్లు దొంగతనం చేసినట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8.50 లక్షలు ఉంటుందన్నారు. ఉండ్రాజవరం పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసులు, తణుకులో రెండు, రాజమహేంద్రవరంలో నాలుగు, కొవ్వూరులో మూడు, పాలకొల్లు, ఏలూరు, గణపవరం, భీమవరం, నిడదవోలు, వీరవాసరం స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదైనట్టు వివరించారు. మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన.. ముగ్గురిపై కేసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6 : ఏలూరు పెరుగుచెట్టు ప్రాంతానికి చెందిన ఒక వివాహిత పట్ల ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. శనివారం బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ముగ్గురు వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలి


విజయరాయిలో సాయుధ బలగాల కవాతు

పెదవేగి, ఏప్రిల్ 6: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ కోరారు. విజయరాయి, నడిపల్లి, జానంపేట గ్రామాల్లో సాయుధ బలగాలతో శనివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాలు, సంకోచాలు లేకుండా పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వేచ్ఛగా ఓటువేసే వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నామని చెప్పారు. మద్యం, నగదు, వస్తువులు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని, ప్రలోభాలకు గురిచేసే సామగ్రిపై సమాచారం అందిస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి


ములగలంపల్లిలో కవాతు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 6 : ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ క్రాంతికుమార్, ఎస్సై వి.చంద్రశేఖర్ అన్నారు. ములగలంపల్లిలో శనివారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కు విలువ తెలియజేస్తూ అవగాహన కల్పించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ శ్రీనివాసులు హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.లక్ష్మణబాబు, పారామిలటరీ దళాలతో శనివారం చాటపర్రు, జాలిపూడి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, వారికి విఘాతం కల్గించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

లింగపాలెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, ఏప్రిల్ 6: ధర్మాజీగూడెంలో ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీ చేశారు. మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రి అక్రమ రవాణా చేయకూడదన్నారు. రూ.50వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, అక్రమ మద్యం కాని, ఎవరైనా తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సీవిజిల్ యాప్‌ద్వారా సమాచారం అందించాలన్నారు. కచ్చితమైన సమాచారం వస్తే వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో ఏవో జె.శాంతి, హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి


కలపర్రు పాఠశాలలో డీఈవో అబ్రహం

పెదపాడు, ఏప్రిల్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని డీఈవో అబ్రహం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. వట్లూరులోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను డీఈవో అబ్రహం శనివారం తనిఖీ చేసి, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ 2 పరీక్షలు ఈనెల 19 వరకు జరుగుతాయని, మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడంలో, నిబంధనలు పాటించడంలో అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు


క్షేత్ర పరిశీలనలో శాస్త్రవేత్తలు

పెదవేగి, ఏప్రిల్ 6: ఏ పంటకైనా విత్తనశుద్ధి ఎంతో అవసరమని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డి.శ్రీనివాస్ అన్నారు. అమ్మపాలెంలో మొక్కజొన్న పంట దిగుబడిపై శనివారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మొక్కజొన్న విత్తే ముందు విత్తనశుద్ధి చేయించడంతోపాటు విషపు ఎరను వాడాలన్నారు. మొక్కజొన్న పంటకు ప్రధాన శత్రువైన కత్తెర పురుగు నివారణతో దిగుబడి గణనీయంగా పెరిగినట్లు గుర్తించామని ఆయన చెప్పారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా రైతులు చిరుధాన్యాలపై అవగాహన పెంచుకుని, సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, ఆర్బీకే సిబ్బంది ధనరాజ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి


డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న కూలీలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: జిల్లాలో నాలుగు నెలల నుంచి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు విడుదల చేయాలని మెప్మా పీడీకి శనివారం వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.4.5 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ఒకపక్క వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతుండగా, ఉపాధి వేతనాలు సకాలంలో రాకపోవడంతో కూలీలు అప్పుల పాలు అయ్యారన్నారు. 15రోజులకు ఒకసారి కూలీలకు వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఆజ్ఞేశాయమ్మ, ఆనందరావు, సుధమ్మ తదితరులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల అనివేటి మండపం వద్ద భక్తుల రద్దీ

ద్వారకా తిరుమల చిన వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6: వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. సుమారు 15 వేల మంది యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. పలువురు భక్తులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

పారిజాతగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 6: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జామున 5 గంటలకు భక్తులకు ఆలయం వద్దకు చేరుకుని మెట్ల నడక యాత్ర, ఆలయ ప్రదక్షణలతో మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి అనంతరం భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. దాత రెడ్డి రంగప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 6: శనివారపుపేట చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం స్వామి వారు గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. అర్చకుడు హయగ్రీవాచార్యులు ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఆలయం వేదపండితులు ఉదయం హోమం, స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. తిరిగి చెన్నకేశవస్వామి దేవాలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.


ఏలూరులో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న బడేటి చంటి


శ్రీనివాసపురంలో దాసరి శేషు, నేతలు, కార్యకర్తల ప్రచారం


కె.కోట మండలం తాడిచర్లలో టీడీపీ నేతల ప్రచారం


గణపవరం మండలం కాశిపాడులో ధర్మరాజు ప్రచారం

కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రజలదే..

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ప్రచారం


రాజవరంలో టీడీపీ, జనసేన, బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న కరాటం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: రాష్ట్ర ప్రజలు గెలవాలనే నినాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని, కూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కూటమి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 47వ డివిజన్‌లో తిలక్‌నగర్‌లో శనివారం ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి పాల్గొన్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా అనేక కార్యక్రమాలు రూపకల్పన చేశామన్నారు. వైసీపీ పాలనలో ఏలూరు నియోజకవర్గంలో పారిశుధ్యం పడకేసిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమ గీతం పాడాలని తెలిపారు. కుమ్మరిరేవు రావిచెట్టు, చొదిమెళ్ళ రాములవారి గుడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభలో బడేటి చంటి, మాజీమంత్రి మరడాని రంగారావు, మధ్యాహ్నపు బలరాం మాట్లాడారు. పెద్దిబోయిన శివప్రసాద్, నగిరెడ్డి కాశీనరేష్, గౌరీశంకర్, వందనాల శ్రీనివాస్, కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని, వీరంకి పండు, వేగిప్రసాద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు రాబోయే రోజుల్లో పేదల జీవితాల్లో వెలుగులు నింపనున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. శ్రీనివాసపురంలో టీడీపీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించారు. శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం సంక్షోభంలో పడిందని, పేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు అధిక పన్నులతో రాష్ట్రం అతలాకుతలం అయ్యిందన్నారు. రాష్ట్ర ప్రగతి సాధించాలన్న, పేదలకు సంక్షేమం అందాలన్నా టీడీపీ కూటమితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎలికే ప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస్, బూత్ కన్వీనర్లు రాగాని శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కేదాసు అర్జునరావు, కాగితాల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రయోజనం

కామవరపుకోట: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం ఉందని తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు అన్నారు. గ్రామంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను ఇంటింటికి అందజేసి కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ నేత కోనేరు వెంకటరామయ్య అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రైతులకు కలిగే ప్రయోజనాలను తెలిపారు. నెక్కలపు సూర్యనారాయణ, కోనేరు వెంకట సుబ్బారావు, నూతి రాటాలు, గంటా సుధీర్‌బాబు, బొబ్బిలి డాన్ దివాకర్, కోటగిరి కిషోర్‌బాబు, కోనేరు జయకృష్ణ, కోనేరు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్‌కు భరోసా కల్పించేది టీడీపీ

పెదవేగి: ప్రజల భవిష్యత్‌కు భరోసా టీడీపీతోనే సాధ్యమని, అలాంటి టీడీపీకే ఓటు వేయాలని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. సూర్యారావుపేటలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధిని సాధించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కంచెన మోహనరావు, తాతా యశ్వంత్ రాజశేఖర్, రవి, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం: గ్రామాల్లో సమస్యలను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిష్కరిస్తామని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. రాజవరం, గంగవరం గ్రామాల్లో కరాటం రాంబాబు, చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రజలు అనేక సమస్యలు వివరించారు. గ్రామాల్లో ఇటీవల జరిగిన రీసర్వేలో అనేక అవకతవకలు జరిగాయని, అర ఎకరం ఉన్న రైతుకు రెండు ఎకరాలు, రెండు ఎకరాలు ఉన్న రైతుకు అర ఎకరం భూములు రికార్డుల్లో నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పేదలకు ఇచ్చిన భూములకు ఆన్‌లైన్ చేయడం లేదని వాపోయారు. గ్రామాలకు దగ్గరలో ఇంటి స్థలం ఇవ్వకుండా శ్మశానాలు, కొండ కాల్వల పక్కన ఇచ్చారని తెలిపారు. ఈ సమస్యలన్నీ కూటమి ప్రభుత్వం వచ్చాక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాడపల్లి రాధాకృష్ణ, గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన నాయకులు దుగ్గిన శ్రీను, రవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

- బుట్టాయగూడెం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు కట్టుపల్లి, బుద్దులవారిగూడెం, కొల్లాయిగూడెం గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని, నియోజకవర్గ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి పార్టీల సీనియర్ నాయకులను కలుసుకుని మద్దతు కోరారు.

వైసీపీకి చరమగీతం పాడాలి : ధర్మరాజు

గణపవరం: వైసీపీ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికల్లో ఆ పార్టీకి చరమగీతం పాడాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కాశిపాడులో జనసేన, టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధర్మరాజు ప్రతీ ఇంటికి వెళ్లి ఓటును అభ్యర్థించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెనుమత్స అజయ్‌కుమార్ రాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, యాళ్ళ సుబ్బారావు, పొత్తూరి నరసింహరాజు, పొత్తూరి వాసురాజు, తోట శ్రీనివాసరావు, వంగా రఘు, తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో..



ఎన్నికల సందర్భంగా నేతలు ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ధర్మాజీగూడెంలో పర్యటించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ టీ స్టాల్‌లో టీ పెట్టి కస్టమర్లకు అందించారు. ధర్మాజీగూడెం తన స్వగ్రామమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. - లింగపాలెం

న్యాయసూత్రాలపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6: న్యాయసూత్రాలపై అవగాహన ఉంటే న్యాయవాద వృత్తిలో రాణిస్తారని జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి జి రామ్‌గోపాల్ అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆధ్వర్యంలో జూనియర్ న్యాయవాదులకు శనివారం అవగాహన తరగతులను నిర్వహించారు. రామ్‌గోపాల్ మాట్లాడుతూ ప్రతి జూనియర్ న్యాయవాది వృత్తిలో నైపుణ్యం కోసం చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ బీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ యువ న్యాయవాదులు ప్రతిరోజు కోర్టులకు హాజరై అన్ని అంశాలను తెలుసుకోవాలన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.రొనాల్డ్‌రాజ్, ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజ్‌గోపాల్, జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఎం నాగరాజు, ఐలూ ప్రధాన కార్యదర్శి కె.మునిస్వామి, గద్దా విజయభాస్కర్, పి వెంకట్, పి.పరమేశ్వరరావు, రాజారావు, కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకన సిబ్బందికి మజ్జిగ పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో జరుగుతున్న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకన సిబ్బందికి ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగను పంపిణీ చేసినట్టు సంఘ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, రామారావు, రెడ్డిదొర తెలిపారు. డీఈవో అబ్రహం మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ఇలాంటి సేవాకార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ బుధవ్యాస్, ఏపీటీఎఫ్ నాయకులు దొరబాబు, రవికుమార్, ప్రసాద్, ఆనంద్‌కుమార్, మూర్తి, పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవితం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 6: పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అన్నారు. విద్యానగర్‌లో శిశుగృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సదుపాయాలు, సేవలపై ఆరాతీశారు. స్వచ్ఛమైన గాలి, నీరు పోషకకరమైన ఆహారం తప్పనిసరిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ పీడీ పీఎల్‌వీఎల్ పద్మావతి, డీసీపీవో సూర్యచక్రవేణి, అధికారులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల భూ ఆక్రమణ

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6: తన పొలానికి సంబంధించిన గుంతదారిని అధికారపార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకున్నారు, తమ కోళ్ళఫారం, మొక్కజొన్న తోటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని టి.నరసాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన సులకాని సుబ్బాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. వారు అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్‌లోని ఫిర్యాదు బాక్సులో వేశారు. తమకు రెండున్నర ఎకరాల భూమి ఉందని, ఎకరంలో కోళ్ళఫారం పెట్టుకుని జీవిస్తున్నామన్నారు. అధికారపార్టీ నాయకులు పుంత దారిని ఆక్రమించుకున్నారని తమ భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది నుంచి కోళ్ళఫారం మూసివేశామని, మిగిలిన ఉన్న పొలంలో మొక్కజొన్న పంట వేశామన్నారు. పంట కోయటానికి అధికారపార్టీ నాయకులు వెళ్ళనివ్వడం లేదని తెలిపారు. పంట పాడైపోతుందని, దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లో నాలుగుసార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా ఫలితం లేదని తక్షణం అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే తమ ఆత్మహత్యే శరణ్యమని ఆమె పేర్కొన్నారు.

9న ఉగాది వేడుకలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 6: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈనెల 9న రామకృష్ణాపురం సాహిత్యమండలిలో వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్లా పురుషోత్తమరావు శనివారం తెలిపారు. పుల్లాభొట్లా శ్రీరామ్మూర్తి స్మారక సాహిత్య పురస్కారం, సాహిత్యరంగంలో సంగీత, పౌరాణిక, నృత్య, సాంఘిక నాటకరంగాల్లో విశేష ప్రతిభకనబరిచిన వారిని ఘనంగా సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సాహిత్య మండలి ఆధ్వర్యంలో స్వాగత గీతం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలుత పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన సునీల్, స్వరూప మండలంలో ఉపాధి హామీ పనులు శనివారం పరిశీలించారు. పైడిచింతపాడులో పని దినాలు, తదితర వసతులపై కూలీను అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఉదయం పూటే పనులకు వచ్చి సకాలంలో పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఏపీవో కిషోర్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లాలో 12 మండలాల్లో మాత్రమే ఉపాధి పనులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: జిల్లాలో 12 మండలాల్లో మాత్రమే ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. వేసవిలోనే ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతాయన్నారు. ఈ నెలలో వారం గడిచినా జిల్లాలో పనులు ప్రారంభం కాలేదన్నారు. రోజుకు రూ.300 వేతనంగా ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలికవసతులు కల్పించాలని మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలో నీడ ఉండేలా టెంట్లు, పనిముట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హిందీ టీచర్ నాగరాజుకు జాతీయ పురస్కారం

కామవరపుకోట ఏప్రిల్ 6. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ సోరంకి నాగరాజుకు నేషనల్ ఇన్నోవేటివ్ శిక్షారత్న అవార్డు లభించింది. హైస్కూల్ ఆవరణలో డీఈవో ఎస్.అబ్రహం శనివారం నాగరాజును దుశ్శాలువాతో సత్కరించారు. నేషనల్ ఇన్నోవేటివ్ సమ్మిట్ 2023-24లో నాగరాజుకు అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు బి.ఉమామహేశ్వరరావు, సీహెచ్.సుధాకరరెడ్డి, టి.రామారావు, వి.వెంకటేశ్వరరావు. బి.రాజాబాబు, జి.రవీంద్రనాథ్ తదితులు పాల్గొన్నారు.

కళాకారుల బకాయి సొమ్ము విడుదల చేయాలి

టి.నరసాపురం, ఏప్రిల్ 6: కళాకారులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు శనివారం డిమాండ్ చేశారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడం కోసం కళాకారులను ఉపయోగించుకుందని ఆయన తెలిపారు. వందలాది మంది కళాకారులు బుర్రకథలు, వీధి నాటికలు, నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలు తదితర కళారూపాలు ప్రదర్శించారని, వారికి ఆర్థిక పారితోషికం ప్రభుత్వం నేటికీ ఇవ్వలేదన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

వేలేరుపాడు, ఏప్రిల్ 6: టేకుపల్లికి చెందిన సూర్యచంద్రరావురెడ్డి ఇల్లు శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. మంటలు ఎగిసిపడడంతో సామగ్రి తెచ్చుకునే అవకాశం లేకపోయిందని బాధితుడు సూర్యచంద్రరావురెడ్డి వాపోయాడు. కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.




ఏలూరు, భీమడోలులో బీజేపీ పతాకం ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టిసీమ నుంచి కైకలూరుకు భారీ కార్ల ర్యాలీ శనివారం నిర్వహించారు. మధ్యాహ్నం పాత బస్టాండ్ సెంటర్ చేరుకున్న ర్యాలీ వసంత మహల్, ఫైర్‌స్టేషన్ సెంటర్ మీదుగా అశోక్‌నగర్‌లో పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పార్టీ జెండా ఆవిష్కరించారు. బీజేపి మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, పార్లమెంట్ కన్వీనర్ కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, ఏడు నియోజకవర్గాల బీజేపీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎంహెచ్ఏ వద్ద లక్కోజు అనిల్‌ఆచార్య ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. గాది రాంబాబు, బాడిప నారాయణరావు, ఎస్.చైతన్యశర్మ, పసుపులేటి మనోహర్ ప్రసాద్, నెరుసు నెలరాజు, దొడ్ల శ్రీనివాస్, మదన్, భాస్కర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- పోలవరం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం భాను థియేటర్ ఆవరణలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్ల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి నిర్మలా కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కరిబండి నాగరాజు, మండల అధ్యక్షుడు కామిశెట్టి నాగరాజు, గ్రంధి బాలకృష్ణ, బెజవాడ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.
- భీమడోలు: స్థానిక సంతమార్కెట్ బీజేపీ స్థూపం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వ సేవలను కొనియాడారు. ఉంగుటూరు కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు, శ్రీనివాస శాస్త్రి, రాఘవులు, జ్యోతి, కవిరాజు, తదితరులు పాల్గొన్నారు.
- కుక్కునూరు: బీజేపీ మండల కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బీజేపీ జెండా ఆవిష్కరించారు. రాచమడుగు వరలక్ష్మి, రాచమడుగు నిరంజన్, సత్యనారాయణరాజు, బేతి అజయ్, బిట్రా అప్పారావు, సమయమంతుల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రేగంటి


పార్టీ కండువాతో ఆహ్వానిస్తున్న చంద్రబాబు

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 6: మండలంలోని జి.కొత్తపల్లి మాజీ సర్పంచ్ రేగంటి వెంకటేశ్వరరావు తన సహచరులతో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆయనకు అధినేత చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు లంకా సత్య నారాయణ ఆధ్వర్యంలో నల్లజర్లలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చేరారు.

కూటమితోనే నాయీబ్రాహ్మణులకు సాధికారత


కరపత్రాలు అందజేస్తున్న రాంబాబు

నిడమర్రు, ఏప్రిల్ 6: నాయీబ్రాహ్మణులకు సాధికారత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమని నాయీబ్రాహ్మణ సాధికారత కమిటీ అధ్యక్షుడు లంకా రాంబాబు అన్నారు. నాయీబ్రాహ్మణ సంఘ కమిటీ సభ్యులతో కలసి పెదనింద్రకొలను, పత్తేపురం గ్రామాలలో శనివారం ఇంటింటికి, సెలూన్ షాపులకు వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోను కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు కొప్పుళ్ళ నాగరాజు, రామ్మూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

వేలేరుపాడు, ఏప్రిల్ 6: ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అక్కినేని వనజ మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎండీ మున్నీరు, సాయిబాబు, కారం దారయ్య, పిట్టాప్రసాద్, బంధం నాగేశ్వరరావు, బంధం అర్జున్, కరటం వెంకటేశ్వర్లు, తాటి దుర్గారావు, యర్రా మధు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పోలవరం సీటు సీనియర్లకు కేటాయించాలి

పోలవరం, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ తరపున పోలవరం ఎమ్మెల్యే సీటు సీనియర్ నాయకులకే కేటాయించాలని పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. చేగొండపల్లిలో శనివారం కాంగ్రెస్ నాయకులు కలుం వెంకటేశ్వర్లు, బొరగం రాజామణి, కుంజం భైరవస్వామి మాట్లాడుతూ పోలవరం ఎమ్మెల్యే సీటు గుర్తింపు లేని అభ్యర్థికి ఎలా కేటాయించారని ప్రశ్నించారు. సీనియర్ నాయకులు ఎందరో ఉన్నారని, ప్రజలకు తెలియని వారికి సీటు కేటాయించడంతో మండలంలో నాయకులు కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారన్నారు.

వట్టి పార్థసారథి సేవలు అభినందనీయం


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

భీమడోలు, ఏప్రిల్ 6: డీసీసీబీ చైర్మన్‌గా వట్టి వెంకట రంగ పార్థసారధి అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎం ఎంపురంలో శనివారం పార్థసారధి వర్ధంతి కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు, ధర్మరాజు, పలువురు నాయకులు, ప్రముఖులు పార్థసారధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 6: ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ కార్యదర్శి విత్తనాల రాజు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని డాంగేనగర్ అర్బన్ పీహెచ్‌సీలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛమైన నీరు, గాలి, వాతావరణం, ఆహారం లాంటి మానవ కనీస అవసరాలను ప్రభుత్వం కల్పించాలని డబ్ల్యూహెచ్ఓ కోరడం జరిగిందన్నారు. మేకల రామ్మోహనరావు, తొర్లపాటి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ సల్మాన్ ఖాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

వేసవిలో తగిన జాగ్రత్తలు అవసరం

జీలుగుమిల్లి, ఏప్రిల్ 6 : వేసవిలో జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి కె.దివ్య అన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో కెఎం.మంగతాయారు, ఎంపీపీ కొర్స పోశమ్మ, ఉప్పల లలితకుమారి, సోమగాని శ్రీనివాస్, కంచర్ల సుధారాణి, సున్నం వరలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అడుగంటిన తాగునీటి చెరువు

వెంకటాపురంలో దాహం కేకలు..

- అడుగంటిన తాగునీటి చెరువు
- రంగుమారిన నీరు తాగలేకపోతున్నామన్న గ్రామస్థులు

కలిదిండి, ఏప్రిల్ 6 : వెంకటాపురంలో తాగునీటి చెరువు అడుగంటింది. నీరు రంగు మారటంతో తాగలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వారం రోజుల్లో చెరువు పూర్తిగా ఎండిపోతుందని వాడుకోవటానికి కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతున్నారు. స్థోమత ఉన్న వారు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు కొనుగోలు చేస్తుండగా పేదలు, వృద్ధులు కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. ఫిబ్రవరి నెలలో తాగునీటి వంతు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవటంతో తాగునీటి చెరువును నింపలేకపోయామని సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సారైనా తాగునీటి వంతు సక్రమంగా ఇస్తే గ్రామస్థులు సహకారంతో చెరువును పూర్తిస్థాయిలో నింపుకుంటామన్నారు.

వలంటీర్ల రాజీనామాకు..

ఆదేశం?

- కొందరు సుముఖం.. మరికొందరు విముఖం
- ప్రభుత్వం మారితే రాజీనామా చేసినవారి గతేంటి
- వలంటీర్ల తర్జన భర్జన

నూజివీడు, ఏప్రిల్ 6: తమ పదవులకు రాజీనామా చేయాలని కోరుతూ వైసీపీ నాయకుల నుంచి నూజివీడు నియోజకవర్గంలో వలంటీర్లకు ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఆదేశాలకు కొందరు వలంటీర్లు సుముఖంగాను, మరికొందరు విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఉద్యోగం ఇచ్చిన వైసీపీ ఇప్పుడు రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతోంది. రాజీనామా చేసి వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటే, ప్రభుత్వం మారితే రాజీనామా చేసిన వారి పరిస్థితి ఏమిటని వలంటీర్లలో చర్చలు ప్రారంభం అయ్యాయి.

ప్రచారం చేసే వారు లేకే..?

వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ నాయకులు అభ్యర్థులతో కలసి ప్రచారంలో పాల్గొనకుండా ముఖం చాటేస్తున్నారు. నాయకులు పిలిచినా, ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి రావాలి? గ్రామాలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాభివృద్ధికి ఉపయోగించకుండా రాష్ట్ర ప్రభుత్వమే తన ఖాతాలో జమ చేసుకుని గ్రామాలకు మొండిచేయి చూపింది. మరో పక్క వలంటీర్లను నమ్ముకుని గ్రామస్థాయి నాయకులను, స్థానిక ప్రజాప్రతినిధులను పార్టీ విస్మరించటం వంటి అంశాలను ఎత్తిచూపుతూ ప్రచారంలోకి దిగకుండా ముఖం చాటేస్తుండటంతో వైసీపీలోనూ, పోటీలో ఉన్న నాయకుల్లోనూ గుబులు మొదలైంది. నూజివీడు రూరల్ మండలంలో 447, నూజివీడు అర్బన్‌లో 306, చాట్రాయి మండలంలో 298, ఆగిరిపల్లి మండలంలో 297, ముసునూరు మండలంలో 300మంది వలంటీర్లు ఉన్నారు. వైసీపీ ఆదేశాలను వీరిలో ఎంతమంది పాటించి రాజీనామాలు చేస్తారో చూడాలి.


ఈవోపీఆర్డీకి రాజీనామా పత్రాలిస్తున్న సింగరాయపాలెం గ్రామ వలంటీర్లు

సింగరాయపాలెం వలంటీర్ల రాజీనామా

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 6: సింగరాయపాలెంలోని గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గ్రామ వలంటీర్లను పెన్షన్ పంపిణీ నుంచి తప్పించడంతో ఇదే అదనుగా భావించిన అధికార వైసీపీ నాయకులు వలంటీర్లను బెదిరించి తమకు అనుకూలంగా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోవచ్చన్న వ్యూహంతో వారితో రాజీనామాలు చేయిస్తున్నారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

మీటర్లు వద్దంటే కరెంట్ కట్!

- వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు
- కోడ్ ఉల్లంఘిస్తూ మీటర్లపై జగన్ బొమ్మ

ముసునూరు, ఏప్రిల్ 6: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియకు ట్రాన్స్‌కో అధికారులు శ్రీకారం చుట్టారు. రమణక్కపేటలో రెండు రోజుల నుంచి స్మార్ట్ మీటర్ల బిగిస్తున్నారు. అయితే మీటర్లు బిగించవద్దని రైతులు వ్యతిరేకిస్తున్నా సిబ్బంది మీ బోరుకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని బెదిరిస్తూ మీటర్లను బిగిస్తున్నారని రైతులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తే సీఎం జగన్ మాత్రం మీటర్లను బిగిస్తామని చెప్పి కేంద్రం వద్ద నుండి రూ. 3500 కోట్లు తీసుకున్నాడని, భవిష్యత్‌లో కరెంట్ బిల్లులు కట్టి పంటలు పండించుకునే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చెక్కపల్లిలో స్మార్ట్ మీటర్ల బిగింపుపై సబ్ స్టేషన్ వద్ద రైతులు, ప్రజాప్రతినిధులు సైతం ఆందోళన చేయడంతో ఈ ప్రక్రియను ట్రాన్స్‌కో సిబ్బంది తాత్కాలికంగా నిలిపివేశారు.

స్మార్ట్ మీటర్లపై జగన్ బొమ్మ...

సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో రమణక్కపేటలో బిగించిన స్మార్ట్ మీటర్లపై జగన్‌బొమ్మ ఉండటం కోడ్ ఉల్లంఘన కాదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే బిగించిన స్మార్ట్ మీటర్లపై ఉన్న జగన్‌రెడ్డి బొమ్మను తొలగించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూటమి గెలుపునకు కృషి : కాపా



నూజివీడు, ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్, నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు కాపా శ్రీనివాసరావు అన్నారు. శనివారం నూజివీడులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా ఆపివేసి రైతు విద్రోహ ప్రభుత్వంగా వైసీపీ పేరుతెచ్చుకుందన్నారు. స్థానిక సెంటిమెంట్‌ను పట్టించుకోకుండా నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలిపేసిందని, అధికారంలోకి వచ్చాక పునఃసమీక్షించి కృష్ణాజిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. పొత్తులో భాగంగా అనేక మంది సీనియర్లకు టిక్కెట్లు దక్కలేదని అయినా వారు పార్టీ గెలుపునకు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు తగు న్యాయం చేస్తానని చెప్పడంతో నియోజకవర్గంలో పార్టీ గెలుపుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. టీడీపీ నాయకులు పామర్తి నాగేంద్రరావు, ఒరుగు రఘునాథబాబు, ఎస్వీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 6: కైకలూరు నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి తెలిపారు. ఆదివారం సాయంత్రం కైకలూరు సీఎన్నార్ గార్డెన్స్ కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులంతా తరలి రావాలని ఆయన కోరారు.


కూటమిలో చేరిన వైసీపీ నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కామినేని, పుట్టా మహేష్, కమ్మిలి విఠల్


ఆగిరిపల్లి జయహో బీసీ సదస్సులో పార్థసారథికి సత్కారం


అప్పాపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి శ్రేణులు

ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు

- కూటమిలో చేరిన వారిని బెదిరిస్తున్నారు..
- వైసీపీని సాగనంపాలని కామినేని పిలుపు
- అందరికీ అందుబాటులో ఉంటానన్న మహేష్

కైకలూరు, ఏప్రిల్ 6: జగన్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం కైకలూరులో ఎన్డీయే కూటమి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన, కైకలూరు నియోజకవర్గంలో కుటుంబ పాలనను సాగనంపాలన్నారు. గతంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలకు ఎనలేని సేవలందించానన్నారు. తనపై బురదజల్లి మరలా లబ్ధి పొందాలని వైసీపీ కుట్ర పన్నుతోందని, వాటిని నమ్మవద్దన్నారు. తమ ఆస్తుల విలువను పెంచుకునేందుకు కైకలూరులో అబ్దుల్ మజీద్ మార్కెట్ కూల్చివేత దుర్మార్గమన్నారు. కూటమి సభ్యులతో కోఆర్డినేట్ కమిటీలు ఏర్పాటుచేస్తున్నామని వీటి ద్వారా గ్రామాల్లో అందరినీ కలుపుకొని విస్తృతంగా ప్రచారం చేస్తామని కామినేని స్పష్టం చేశారు. త్వరలో కైకలూరులో పవన్‌కల్యాణ్‌తో బహిరంగసభ ఉంటుందని, చంద్రబాబుతో గానీ, లోకేశ్‌తో గానీ మరో సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10.48నిలకు నామినేషన్ వేస్తున్నట్లు కామినేని వెల్లడించారు. కాగా శుక్రవారం నున్న కృష్ణబాబును కూటమిలో చేరగా ఎమ్మెల్యే అతని అనుచరులు ఆయనను బలవంతంగా వైసీపీలో చేర్చి సోషల్‌మీడియాలో ప్రచారం చేశారని, అయినా కృష్ణబాబు టీడీపీలోనే ఉన్నారని, వైసీపీ జిమ్మిక్కులను నమ్మవద్దని కామినేని సూచించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ జగన్ శవ రాజకీయాలు చేసి లబ్ధి పొందారన్నారు. తాను ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఎవరైనా తనను నేరుగా కలవచ్చని తెలిపారు. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు వైసీపీ నాయకులు కూటమిలో చేరగా వారందరికీ కండువాలు కప్పి ఆయా పార్టీల్లోకి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన యలవర్తి భవాని టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు పోసిన పాపారావు గౌడ్, కొడాలి వినోద్, మాజీ జెడ్పీటీసీలు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, నున్న రమాదేవి, పార్టీల మండల పార్టీల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, పోకల జోగిరాజు, నారగాని నాగేశ్వరరావు, తాడినాడ బాబు, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్‌కిషోర్, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బటన్ నొక్కి సగం సొమ్మే ఖాతాల్లోకి..

ఆగిరిపల్లి, ఏప్రిల్ 6: బటన్‌లు నొక్కి సగం సొమ్మే ఖాతాల్లో వేయటం తప్ప ప్రజా సంక్షేమం పట్టించుకోని జగన్‌ను సాగనంపాలని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఆగిరిపల్లి జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే సబ్ ప్లాన్ పక్కాగా అమలుచేస్తామన్నారు. తిండి గింజలు పూర్తిగా కొంటామని వాగ్దానం చేస్తారు కాని కనీసం సంచులు కూడా ఉండవని, పామాయిల్ రైతులను అప్పుల ఊబిలో ముంచేశాడన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌ని తిట్టడం తప్పితే రాష్ట్రాభివృద్ధిపై జగన్‌కు ధ్యాసలేదన్నారు. మల్లవల్లిలో చంద్రబాబును నమ్మి వేల కోట్లతో పరిశ్రమలు వస్తే ఇప్పటి ప్రభుత్వంపై నమ్మకం లేక ఆ పరిశ్రమలు తరలిపోతున్నాయన్నారు. తొలుత పార్థసారథిని బీసీ నాయకులు గజమాలతో సత్కరించారు. నూజివీడు జనసేన నాయకుడు బర్మా ఫణిబాబు, బీజేపీ నాయకులు జి.ఆర్.కె రంగారావు, కొవ్వలి బాబురావు, ఆగిరిపల్లి టీడీపీ నాయకులు చిట్నేని శివరామకృష్ణ, మల్లవల్లి కోటేశ్వరరావు, పామర్తి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

నూజివీడు టౌన్: నూజివీడు పట్టణానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన 50 కుటుంబాల వారు కూటమి అభ్యర్థి కొలుసుపార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రతాప్ ఏకపక్ష నిర్ణయాలతో అక్రమ కేసులు పెట్టడంతో విసుగు చెంది టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కూటమి గెలుపునకు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

పార్థసారథి సతీమణి పూజలు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి విజయం సాధించాలని నూజివీడు గంగానమ్మ రావిచెట్టు వద్ద ఆయన సతీమణి లక్ష్మీకమల శనివారం పూజలు చేశారు. పట్టణంలో శనివారం ఆమె 4, 5 వార్డుల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం తెలుగు మహిళలతో కలసి ఆమె గంగానమ్మకు పూజలు చేశారు. నూజివీడు మాజీ కౌన్సిలర్లు గొల్లు దుర్గాదేవి, కొంపెల్ల కృష్ణకుమారి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షులు తిరుమలశెట్టి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములు దోచుకునేందుకు కుట్ర

మండవల్లి: రైతుల భూములను దోచుకునేందుకు వైసీపీ యత్నిస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ మండవల్లి మండల శ్రేణులు ప్రజలకు వివరించారు. మండలంలోని అప్పాపురంలో శనివారం కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఓట్లు అభ్యర్థిస్తూ ఆయా పార్టీల శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. విధివిధానాలను లేని జీవోలను అమలు చేసి ప్రజల ఆస్తులను దోచుకోవడం ఎంతవరకు న్యాయమో రైతులే గ్రహించాలని పేర్కొన్నారు. సజ్జ బాబి, అట్లూరి భవానీ ప్రసాద్, గజ్జల గణేష్, గన్నమనేని నాని, వీరవల్లి శివయ్య, గంగుల శ్రీదేవి, కరేటి బుజ్జి, తలారి రాజేష్, నల్లిబోయిన రాజేష్, ముళ్లపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో టీడీపీ విస్తృత ప్రచారం

కలిదిండి: కలిదిండిలో శనివారం టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌లకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, నాయకులు నున్న వెంకటేశ్వరరావు, బషర్‌తుల్లా, నాంచారయ్య పాల్గొన్నారు.

కూటమితోనే అన్ని వర్గాలకు న్యాయం

కైకలూరు, ఏప్రిల్ 6: ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. శనివారం కామినేని, పుట్టా మహేష్‌లను గెలిపించాలని కైకలూరు మండలం ఆటపాక, అగ్రహారం గ్రామాల్లో పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీర మహిళలు తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి, జనసేనానిలు మైగాపుల రామాంజనేయులు, పుప్పాల సూర్యప్రకాష్, బొబ్బిలి సాయి, ముత్యాల తరుణ్, కొటికలపూడి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 6: బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నూజివీడులో వేంకటాచలస్వామి ఆలయంలో రావిచెట్టు వద్ద బీజేపీ జెండా ఆవిష్కరించారు. కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశప్రగతి, ప్రజా సంక్షేమం కోసం వికసిత భారత్ నిర్మాణం కోసం కూటమిని గెలిపించాలని కోరారు. బీజేపీ వ్యవస్థాపక సభ్యుడు కృష్ణారావు, సీనియర్ నాయకుడు ఆముదాల ఇస్సాకు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నూజివీడు, ఆగిరిపల్లి మండల అధ్యక్షులు గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, కొవ్వలి బాబురావు, సీనియర్ నాయకుడు వైఎస్ దొర్రై, మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివరాజు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కును వినియోగించుకోవాలి

ముసునూరు, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలని కోరుతూ కళాజాత నిర్వహించారు. శనివారం ముసునూరులో మెయిన్ సెంటర్, ఎస్సీ కాలనీల్లో కీర్తన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో 'నీ ఓటు-నీ భవిష్యత్' అంశంపై కళాకారుడు ఎం.ప్రసాదబాబు కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

కలిదిండి, ఏప్రిల్ 6 : మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎంఈవో ప్రభాకర్ బాబు మట్టగుంట ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏప్రిల్ 18 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.

చంద్రబాబును కలసిన వినోద్



ముదినేపల్లి, ఏప్రిల్ 6 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ను నల్లజర్లలో ముదినేపల్లికి చెందిన పార్టీ కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ కలిశారు. శుక్రవారం అక్కడ జరిగిన ఏలూరు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న అనంతరం కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తోపాటు చంద్రబాబును కలిశారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల భవిష్యత్తుకు తాను అండగా ఉంటానని చంద్రబాబు భరోసా ఇచ్చారని తెలిపారు. కైకలూరు కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని చంద్రబాబు కోరారని చెప్పారు.

ఎంపీ అభ్యర్థి మహేష్‌ను కలసిన బీసీ నేతలు



కలిదిండి, ఏప్రిల్ 6 : ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను కలిదిండి మండలానికి చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, కార్యనిర్వాహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు శనివారం ఏలూరు టీడీపీ కార్యాలయంలో కలిశారు. ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని అసెంబ్లీ, పార్లమెంట్ కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని మహేష్ యాదవ్ సూచించారన్నారు. బీసీలందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారన్నారు.


కొలుసు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నూజివీడు పట్టణవాసులు


ఆటపాకలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు


కలిదిండిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు

ముదినేపల్లి, ఏప్రిల్ 6 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలో వాహనాల తనిఖీలను అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో పెదపాలపర్రు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్ పోస్టు వద్ద, మండలంలోని అన్ని ప్రధాన రహదారుల్లో అధికారుల బృందాలు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. చెక్ పోస్టు వద్ద ఎస్ఐ వెంకట్ కుమార్, మండల పరిషత్ ఏవో రమణబాబుతోపాటు వివిధ చోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, డ్రైనేజీ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్, ఇతర సిబ్బంది, ప్రైవేట్ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 6: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా ఇండోర్ స్టేడియం క్రీడా కారులు భువనరత్నశ్లోక, అండర్-17 విభాగంలో సీహెచ్ మౌనికదివ్యశ్రీ, రజిత పతకాలు, రింక్-2 లో కాంస్య పతకం సాధించారని డీసీఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గతనెల 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరు ఈనెల 10 నుంచి 15వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక అయ్యారు.

స్థానిక నాయకుల వల్లే ఓటమి: ముద్దరబోయిన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 6: స్థానిక టీడీపీ నాయకుల తీరువల్లే గత ఎన్నికల్లో తాను ఓటమి చెందానని, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆరోపించారు. నూజివీడు పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఆయన స్థానికులతో సమావేశమయ్యారు. తాను టీడీపీని బలోపేతం చేస్తే పార్థసారథికి టిక్కెట్టు ఇవ్వడం అన్యాయమన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

చాట్రాయి, ఏప్రిల్ 6: మండలంలోని మర్లపాలెం కోనేటి చెరువులో ప్రమాద వశాత్తు జారిపడి తాణంకి చంటి (56) అనే పశువుల కాపరి మృతి చెందాడు. శుక్రవారం పశువులు తోలుకొని వెళ్ళిన సాయంత్రం కూడా రాకపోవటంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు అతని కోసం వెదికినా కనిపించలేదు. శనివారం ఉదయం చెరువులో చంటి చెప్పు నీళ్ళపై తేలడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసీహెచ్ స్వామి పర్యవేక్షణలో పోలీస్, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహకారంతో చెరువులో గాలించి చంటి మృతదేహాన్ని వెలికి తీశారు. శవ పంచనామా జరిపి పోస్టుమార్టంకు తరలించారు. సర్పంచ్ ముల్లంగి చిట్టిబాబు, ఉప సర్పంచ్ వెల్డి రాజారావు, టీడీపీ నాయకుడు వెల్డి అప్పారావు మృతుని కుటుంబీకులను పరామర్శించారు.




ఎండకు తాళలేక చెట్టు కిందకు చేరిన మేకలు.. ముదినేపల్లిలో నిర్మానుష్యంగా రహదారి.. తలకు చున్నీతో మహిళ

మండుతున్న ఎండలు

ఉక్కపోత..వడగాడ్పులతో ప్రజలు విలవిల

చాట్రాయి, ఏప్రిల్ 6: ఎండ, వడగాల్పులకు ప్రజలు అల్లాడిపోతున్నారు. శనివారం ఉష్ణోగ్రత 40 డిగ్రీలు చేరుకోవటంతో మధ్యాహ్నం వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వృద్ధులు, గర్భిణులు ఎండకు విలవిల్లాడారు. ఫ్యాన్లు, కూలర్ల నుంచి వెచ్చటి గాలి రావటంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇక మూగజీవాలు చెట్టు నీడ కన్పిస్తే అక్కడకు చేరి సేదతీరుతున్నాయి. ఏప్రిల్‌లోనే ఎండలు ఇలా ఉంటే మే ఎంత భయంకరంగా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముదినేపల్లి: వడగాల్పులతో శనివారం ముదినేపల్లి ప్రాంతంలో జనం అల్లాడిపోయారు. ఉదయం 9 గంటలకే ఉక్కపోతలు మొదలయ్యాయి. 11 గంటలకే ముదినేపల్లిలోని జాతీయ రహదారి నిర్మానుష్యంగా కనిపించింది. మహిళలు గొడుగులు, చున్నీలు చుట్టుకుని తిరిగారు. వరి గడ్డి లోడు ట్రాక్టర్లను ముదినేపల్లిలో నిలిపివేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం భయపడిపోయారు.

భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

ఏలూరుసిటీ, ఏప్రిల్ 6: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. భానుడి భగభగలతో రోజువారీ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని విద్యుత్ అధికారుల నివేదికలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఏప్రిల్ మొదటి వారంలోనే తారాస్థాయికి చేరిందని, వారం రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయని, దీంతో ఎండ వేడిమిని తట్టుకోలేక ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్యాన్ల వినియోగం, కూలింగ్ వాటర్ కోసం ఫ్రిజ్‌లు వినియోగం పెరిగిందని చెబుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ కోటా వస్తోందని, అయినా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోత అమలులోనే ఉందని తెలుస్తోంది. బోర్ల కింద సాగులో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులు ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు విద్యుత్ వినియోగం పరిశీలిస్తే ఈనెల 2,3,4 తేదీల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని ఏపీఈపీడీసీఎల్ వారి నివేదికలు చెబుతున్నాయి. ఈ పరిస్థితులను పరిశీలిస్తే రాబోయే రోజుల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం ఇలా..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు (గత వారం రోజుల్లో)

తేదీ	2023 సంవత్సరం: విద్యుత్ కోటా (మిలియన్ యూనిట్లు)	2023 సంవత్సరం: వినియోగం (మి.యూ)	2024 సంవత్సరం: విద్యుత్ కోటా (మి.యూ)	2024 సంవత్సరం: వినియోగం (మి.యూ)	వ్యత్యాసం
మార్చి 30	22.340	22.308	24.143	23.469	1.161
మార్చి 31	22.078	22.036	24.029	23.166	1.130
ఏప్రిల్ 1	22.933	21.195	24.080	22.910	1.715
ఏప్రిల్ 2	20.032	20.185	24.080	23.239	3.054
ఏప్రిల్ 3	22.616	20.320	23.588	23.226	2.906
ఏప్రిల్ 4	21.248	20.811	23.896	23.291	2.480
ఏప్రిల్ 5	21.513	21.599	24.071	23.449	1.850